ప్రజాశక్తి

బుధవారం 13 డిసెంబర్ 2023 5

శ్రీ సత్యసాయి

అంగన్‌వాడీల 'సమ్మె'బాట..!

◆ జిల్లా వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు

◆ ఎన్నికల హామీలు అమలు చేయాలని డిమాండ్

పుట్టపర్తి ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

సమస్యల పరిష్కారం కోరుతూ ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీలు సమ్మెబాట పట్టారు. మంగళవారం అన్ని మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు చేశారు. తహశీల్దార్, ఐసిడిఎస్ కార్యాలయాల వద్ద బైటాయించి ఆందోళన నిర్వహించారు. సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ సమ్మెకు పలు పార్టీలు, ప్రజాసంఘాల మద్దతు తెలిపాయి. జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలం అయ్యారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీల సమ్మెతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు మూతబడ్డాయి. సమస్యలను పరిష్కరించేంత వరకు సమ్మెను కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు.

వార్త 6లో

అడగడమే అత్తెసరు..!

◆ మొన్న అంచనా రూ.251.20 కోట్లు

◆ కరువు బృందాన్ని అడిగింది రూ.158.63 కోట్లే...

◆ సమీక్షకు మీడియాకు అనుమతి నిరాకరణ

◆ పొద్దుగూకే వేళ పొలాల పరిశీలన

గుత్తి మండలంలో ఎండిన ఆముదం పంట పొలాలను పరిశీలిస్తున్న కేంద్ర కరువు బృందం సభ్యులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి
గుత్తి, కళ్యాణదుర్గం

అడగనిదే అమ్మైనా అన్నం పెట్టదంటారు... అలాంటిది కరువు సాయం అడగటంలోనే లోపముంటే అందే సాయం ఎంతన్నది ప్రశ్నార్థకంగా మారింది. కేంద్ర కరువు బృందం ఉమ్మడి జిల్లాలో పర్యటన నిమిత్తం మంగళవారం అనంతపురానికి చేరుకుంది. ఈ బృందం ముందు జిల్లా అధికార యంత్రాంగం పెట్టిన ప్రతిపాదనలు అత్తెసరుగా ఉన్నాయన్న చర్చ నడుస్తోంది. గణాంకాలు కూడా కరువును ప్రతిభించే విధంగా లేకపోవడంతో కరువు తీవ్రత తక్కువగానే ఉందనే అభిప్రాయంలో కేంద్ర ప్రతినిధి బృందంకు కనిపిస్తుండటం గమనార్హం.

కేంద్ర కరువు బృందం అనంతపురం జిల్లాలో మంగళవారం నాడు పర్యటించింది. భారత వ్యవసాయ శాఖ సంయుక్త కార్యదర్శి పంకజ్ యాదవ్ నేతృత్వంలోని కేంద్ర కరువు బృందం ఉదయం 11.30 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయం చేరుకున్నారు. మధ్యాహ్నం 1-30గంటల వరకు కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు.

అనంతరం అధికారులతో కరువుకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు కలెక్టర్ కార్యాలయంలోనే ఉన్న కరువు బృందం అనంతరం భోజనం తరువాత సాయంత్రం నాలుగు గంటలకు మూడు బృందాలూ క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాయి. ఒక బృందం అనంతపురం రూరల్ మండలంలోని కందుకూరు, తలుపూరు గ్రామాల్లో కంది, వేరుశనగ పంట పొలాలను పరిశీలించారు. రెండవ బృందం కళ్యాణదుర్గం, గుమ్మగట్ట మండలంలోని 75 వీరాపురం గ్రామాల్లో పర్యటించింది. మూడవ బృందం గుత్తి, పామిడి మండలాల్లో పర్యటించి పత్తి, ఆముదం, కంది పంటల పొలాలను పరిశీలించింది. పంటపొలాల పరిశీలన ప్రారంభమయ్యే సరికే నాలుగు గంటలు కావడంతో కొద్దిసేపటికే పొద్దుగూకే పరిస్థితి నెలకొనడంతో పర్యటన హడావుడిగా సాగింది. ఈ సందర్భంగా అక్కడున్న రైతులతో మాట్లాడి కరువు పరిస్థితులను తెలుసుకున్నారు. పంటకు పెట్టిన పెట్టుబడులు, దిగుబడి, రాబోయే రోజులకు అవసరమైన పశుగ్రాసం తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. వర్షాలు చాలా తక్కువగా పడటంతో ఈ ఏడాది పంట పూర్తిగా దెబ్బతినిందని అన్ని ప్రాంతాల్లోనూ రైతులు కరువు బృందం ఎదుట ఏకరువు పెట్టారు.

అడగడమే అత్తెసరు..!

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పంటనష్టం అంచనాలను రూపొందించింది. దీని ప్రకారం అనంతపురం జిల్లాలో జరిగిన పంటనష్టానికి సంబంధించి రూ.251.20 కోట్లు నిధులు అవసరమని అధికారులు ప్రతిపాదించారు. ఇప్పుడొచ్చిన కరువు బృందం ముందు మాత్రం వ్యవసాయానికి సంబంధించి ఎన్‌డిఆర్‌ఎఫ్‌కు ప్రతిపాదించినది రూ.158.63 కోట్లు మాత్రమే కావడం గమనార్హం. ఇక ఉద్యానవన పంటలకు సంబంధించి కేవలం మిర్చి పంటకు మాత్రమే రూ.43.17 కోట్లు ప్రతిపాదించారు. మొత్తంగా వ్యవసాయానికి రూ.201.80 కోట్లు ప్రతిపాదించారు. పశు సంవర్ధక శాఖకు రూ.1.74 కోట్లు గ్రామీణ నీటి సరఫరాకు రూ.7.04 కోట్లు, పట్టణ తాగునీటి సరఫరాకు రూ.2.72 కోట్లు, ఉపాధి హామీకి రూ.116.52 కోట్లు కలిపి మొత్తం రూ.329.82 కోట్లు ప్రతిపాదించారు. ఉపాధి హామీ పథకంలో వేతనాలకు రూ.69.90 కోట్లుకాగా, మెటీరియల్ కంపోనెంట్‌కు రూ.46.62 కోట్లు ప్రతిపాదించారు.

మీడియాకు దూరంగానే..!

కేంద్ర కరువు బృందం పర్యటన మొత్తం మీడియాకు దూరంగా సాగింది. జిల్లా కలెక్టరేట్‌లో ఉదయం జరిగిన సమీక్షకు అనుమతించలేదు. సమీక్ష అనంతరం కేంద్ర కరువు బృందం టీమ్ లీడరు పంకజ్ యాదవ్ మీడియాకు సమాచారాన్ని బ్రీఫ్ చేశారు. అనంతరం పర్యటన సమయంలోనూ వెంట మీడియాను తీసుకెళ్లలేదు. బృందం సభ్యులు ఎక్కడికి వెళ్తున్నారన్న విషయాలపైనా కూడా మీడియాకు సరైన స్పష్టత ఇవ్వకుండానే పర్యటన సాగింది.

జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులను ఫొటోల ద్వారా కేంద్ర కరువు బృందానికి వివరిస్తున్న కలెక్టర్

కరువు దృష్ట్యా పంటలు ఎండిపోయిన దుస్థితిని కరువు బృందం సభ్యులకు వివరిస్తున్న మహిళా రైతు

కరువు బృందానికి వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

కరువు జిల్లాను ఆదుకోవాలి : సిపిఎం

జిల్లాలో వర్షాభావంతో కరువు నెలకొన్న తరుణంలో జిల్లా ప్రజలను అన్ని విధాలుగా ఆదుకోవాలని సిపిఎం నాయకులు కేంద్ర కరువు బృందాన్ని కోరింది. ఈ మేరకు కలెక్టరేట్‌లో వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడుతూ జిల్లాలో కరువు ఏర్పడిన నేపథ్యంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు 200 రోజులు కల్పించి, రోజుకూలి రూ.600 ఇవ్వాలన్నారు. పట్టణాల్లోనూ ఉపాధి హామీ పనులు కల్పించాలన్నారు. ఈ ఖరీఫ్‌లో సకాలంలో వర్షాలు రాకపోవడంతో జిల్లాలోని సుమారు 5 లక్షల ఎకరాల్లో విత్తనాలు వేయలేదన్నారు. ఈ రైతులందరూ కరువు వల్ల నష్టపోయారని తెలిపారు. కౌలు సాగుదారులు పంటనష్టంతో పాటు కౌలు నష్టపోయారని తెలిపారు. గొర్రెలు, మేకల పెంపకందార్లు, పాడిరైతులు వర్షాభావం వల్ల తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ఇలా కరువు వల్ల నష్టపోయిన వీరందరూ సంవత్సరం రోజులు జీవించడానికి సరిపడా పరిహారం చెల్లించడం నిజమైన కరువు పరిహారంగా భావిస్తున్నట్లు తెలిపారు. జిల్లాకు రూ.10వేల కోట్లు కరువు ప్యాకేజీని ప్రకటించి రైతుల అప్పులు మాఫీ చేయాలన్నారు. పంట సాగుచేసి నష్టపోయిన రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఆధారంగా ఎకరాకు రూ.30 వేలు పరిహారం ఇవ్వాలన్నారు. పట్టణాల్లో జాతీయ ఉపాధి హామీ పనులు కల్పించాలన్నారు. కౌలురైతులకు కౌలు రద్దు చేసి పంట నష్టపరిహారం వాస్తవ సాగుదార్లు అయిన కౌలు రైతులకు చెల్లించాలన్నారు. గొర్రెలు, మేకల పెంపకందార్లకు కరువు ఫైనాన్స్ ఇవ్వాలన్నారు. పాడి రైతులకు లీటర్‌కు రూ.10లు కరువు బోనస్ చెల్లించాలన్నారు. తెల్లరేషన్ కార్డు ఉన్న వారందరికీ బియ్యం, కందిపప్పు, గోధుములు, చక్కెర, మంచినూనె, వంటి 14 రకాల నిత్యావసర సరుకులు చౌకడిపో ద్వారా అందించాలన్నారు. రెవెన్యూ గ్రామాల్లో పశుగ్రాస కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల రంగయ్య, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, మన్నీల రామాంజనేయులు, వై.వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గార్మెంట్స్ కార్మికుల మెరుపు ఆందోళన

◆ గోరంట్ల 'నిషా' డిజైన్స్ గార్మెంట్స్ ఎదుట ధర్నా

◆ వేతనాలు పెంచి, సమస్యలు పరిష్కరించాలి

◆ యాజమాన్యం వేధింపులు ఆపాలని డిమాండ్

నిషాగార్మెంట్స్ వద్ద ఆందోళన చేస్తున్న మహిళా కార్మికులు

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

మండల పరిధిలోని గుంతపల్లి వద్ద ఉన్న నిషా డిజైన్స్ గార్మెంట్స్ కార్మికులు మెరుపు ఆందోళనకు దిగారు. సమస్యలు పరిష్కరించి వేతనాలు పెంచాలని, గార్మెంట్స్ అధికారులు సిబ్బందిపై వేధింపులను ఆపాలని డిమాండ్ చేస్తూ గార్మెంట్స్ పరిశ్రమ ముందు మహిళా కార్మికులు పెద్దఎత్తున బైఠాయించి మంగళవారం ఉదయం ఆందోళన చేపట్టారు. గుంతపల్లి వద్ద ఉన్న టెక్సపోర్ట్ ఓవర్సీస్ ప్రైవేట్ లిమిటెడ్, నిషా డిజైన్స్ గార్మెంట్స్‌లో దాదాపు 1200 మందికిపైగా మహిళలు పనిచేస్తున్నారు. అతి తక్కువ వేతనాలు ఇచ్చి తమతో వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని గత కొన్ని రోజులుగా మహిళా కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యలపై యాజమాన్యం స్పందించకపోవడంతో వారు ఆందోళనకు దిగారు. ఒక్కసారిగా కార్మికులు ఆందోళనకు దిగడంతో పరిశ్రమ ప్రాంతం ఉద్రిక్తంగా మారింది. మహిళా కార్మికులు ఎవరూ బయటకు వెళ్లకుండా యాజమాన్యం ప్రధానగేటుకు తాళాలు వేయించింది. ఈ విషయం తెలుసుకున్న కార్మికుల కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని వారికి మద్దతుగా నిరసన తెలిపారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐలు లక్ష్మీనారాయణ, బాబులు అక్కడికి చేరుకుని ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడే ప్రయత్నం చేశారు. హెచ్ఆర్ విజయ్‌ని పిలిపించి కార్మికుల సమక్షంలో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా మహిళా కార్మికులు మాట్లాడుతూ గార్మెంట్స్ యాజమాన్యం కొన్ని నెలలుగా తమ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. వేతనాలు సక్రమంగా ఇవ్వకుండా ఇష్టారాజ్యంగా పనులు చేయించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేతనాలు తక్కువ ఇస్తూ పనిఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. దీనిపైన ఎవరైనా ప్రశ్నిస్తే వారిని వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమ యాజమాన్యం ఏర్పాటు చేసిన బస్సుల్లో ప్రయాణానికి కూడా తమ వద్ద డబ్బులు తీసుకుంటున్నారని చెప్పారు. యాజమాన్యం వచ్చి సమస్యలు పరిష్కరించేంత వరకు ఆందోళన కొనసాగిస్తామని మహిళలు స్పష్టం చేశారు. ఇలా మధ్యాహ్నం వరకు మండుటెండలో పరిశ్రమ ఎదుట బైఠాయించారు. విషయం తెలుసుకున్న కంపెనీ వైస్ ప్రెసిడెంట్ దినేష్ గౌడ్ అక్కడ చేరుకుని మహిళా కార్మికులతో మాట్లాడారు. కార్మికులు తెలిపిన అన్ని సమస్యలనూ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వేధింపులను నియంత్రిస్తామని, వేతనాలు పెంచేందుకు కూడా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ హామీతో కార్మికులు ఆందోళన విరమించారు.

మండల మేజిస్ట్రేట్ జోక్యం చేసుకోవాలి..

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్

మండల పరిధిలోని గుంతపల్లి దగ్గర ఉన్న నిషా గార్మెంట్స్ పరిశ్రమలో కార్మికులు చేస్తున్న పోరాటం న్యాయం అయినదని, దీనిపై మండల మేజిస్ట్రేట్ జోక్యం చేసుకుని వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ డిమాండ్ చేశారు. ఈ సమస్యపై ఆయన మాట్లాడుతూ నిషాగార్మెంట్స్ పరిశ్రమలో కేవలం రూ.6 నుంచి రూ.10 వేల నామమాత్రపు వేతనాలు ఇస్తూ అధిక పనులు చేయించుకుంటున్నారని చెప్పారు. మహిళా కార్మికుల పని చేస్తున్న చోట యాజమాన్యం పురుష ఉద్యోగులను ఏర్పాటు చేసిందన్నారు. వీరు మహిళలను వేధింపులకు గురి చేస్తున్నారని చెప్పారు. ఇష్టానుసారంగా పని ప్రదేశంలో లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. ఇచ్చే అరకొర వేతనం కూడా సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. ఈ సమస్యలన్నింటిపై మండల మెజిస్ట్రేట్ స్పందించి వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. మహిళా కార్మికులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి సిపిఎం ఎప్పుడూ అండగా ఉంటుందని తెలియజేశారు.

6న జెఎన్‌టియు స్నాతకోత్సవం

ఉపకులపతి రంగజనార్ధన

ప్రజాశక్తి-అనంతపురం

వచ్చేనెల 6వతేదీన జెఎన్‌టియు 13వ స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఉపకులపతి రంగజనార్ధన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు గవర్నర్, ఛాన్సలర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఆమోదం తెలుపుతూ రాజ్ భవన్ నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు తెలిపారు. కాగా ఇప్పటికే స్నాతకోత్సవానికి సంబంధించిన నిర్వహణ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. ఆయా కమిటీలకు కేటాయించిన పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. స్నాతోకోత్సవం పండుగలా జరగాలని సూచించారు. స్నాతకోత్సవ సందర్భంగా పిహెచ్‌డి పట్టాలు, బంగారు పతకాలు అందజేయనున్నట్లు తెలిపారు.

పెద్దలకో న్యాయం.. పేదలకో న్యాయమా.?

తహశీల్దార్, ఎస్ఐలను నిలదీసిన పేదలు

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

మండల పరిధిలోని పాలసముద్రం గ్రామానికి చెందిన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేంత వరకూ పోరాడుతూనే ఉంటామని సిపిఎం నాయకులు స్పష్టం చేశారు. తహశీల్దార్, ఎస్ఐ బాబు పోలీసు సిబ్బందితో కలిసి నిరుపేదలు ప్రభుత్వ స్థలంలో వేసుకున్న గుడిసెల వద్దకు చేరుకుని చట్టవిరుద్ధ పనులు, ఆక్రమణల ద్వారా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోరాదని సిపిఎం నాయకులు, పేదలను హెచ్చరించారు. దీంతో నిరుపేదలు మాట్లాడుతూ పెద్ద పెద్ద నాయకులు, భూస్వాములు ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకుంటే పట్టించుకోని అధికారులు, పేదలు తలదాచుకోవడానికి సెంటు స్థలంలో గుడిసెలు వేసుకుంటుంటే దోషులుగా చిత్రీకరించి కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అర్జీలు ఇచ్చి 3 నెలలవుతున్నా ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడం చట్టం పరిధిలో తప్పు కాదా అని నిలదీశారు. తహశీల్దార్ మాట్లాడుతూ అర్హులందరికీ తప్పకుండా న్యాయం చేస్తామని, గుడిసెలు తొలగించాలని సూచించారు. రాతపూర్వకంగా ఎండార్స్‌మెంట్ ఇస్తేనే ఖాళీ చేస్తామని వారు స్పష్టం చేయగా తహశీల్దార్ వెనుదిరిగారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు వెంకటేశులు, సిపిఎం మండల నాయకులు కొండా వెంకటేశులు, పేదలు ప్యారి, అశ్విని, నారాయణ, రామలక్ష్మమ్మ, వెంకటలక్ష్మమ్మ, లక్ష్మీదేవి, గంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మార్పులు-చేర్పులు..?!

◆ అభ్యర్థుల ఎంపికపై వైసిపిలో ఊహాగానాలు ◆ నేతల్లో గుబులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికలకు సమయం ఆసన్నమవుతుండటంతో అప్పుడే రాజకీయ వేడి రగులుతోంది. ప్రధానంగా అధికార వైసిపిలో రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజులుగా మార్పులు, చేర్పులు జరుగుతున్నాయి. ఈ ప్రభావం అనంతపురం ఉమ్మడి జిల్లాపైనా ఉంది. గత సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి జిల్లాలో తిరుగులేని విజయాన్ని సాధించింది. 14 అసెంబ్లీ స్థానాల్లో 12, రెండు పార్లమెంట్ స్థానాలను వైసిపినే గెలుచుకుంది. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లోనూ ఇదే మాదిరి ఫలితాలుండాలని ఆ పార్టీ ఆలోచిస్తోంది. ఇందులో భాగంగా ఇప్పుడున్న ఎమ్మెల్యేల పనితీరు, వారికి ప్రజల్లోనున్న ఆదరణను సర్వేల ద్వారా గుర్తించే పనిని ఇదివరకే గుర్తించింది. ఆరోపణలు, పనితీరు సరిగాలేని వారిని ఇప్పుడు మారుస్తున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ మార్పులు ఏయే నియోజకవర్గాల్లో ఉంటాయన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం నియోజకవర్గంలో వైసిపి ఇన్‌ఛార్జి మార్పు ఇప్పటికే జరిగింది. అంతకముందున్న ఇక్బాల్ స్థానంలో దీపికను తీసుకొచ్చారు. ఈ రకమైన మార్పులు ఇంకెన్ని చోట్ల జరగనున్నాయన్నది రాజకీయవర్గాల్లో చర్చ నడుస్తోంది.

సగానికిపైగా స్థానాల్లో మార్పు.?

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 నియోజకవర్గాలుంటే సగానికిపైగా స్థానాల్లో పాత వారిని కాదని, కొత్తవారికి అవకాశం కల్పిస్తారన్న ఊహాగానాలు జోరుగా సాగుతున్నాయి. అనంతపురం జిల్లాకు సంబంధించినంత వరకు శింగనమల నియోజకవర్గం ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి స్థానంలో కొత్తవారికి ఈసారి చోటు కల్పించే ఆలోచనలో పార్టీ అధిస్టానమున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే పద్మావతి భర్త ఆలూరు సాంబశివారెడ్డికి ఈ విషయాన్ని తెలియజేశారని పార్టీ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. అదే సమయంలో కళ్యాణదుర్గంలోనూ మంత్రి ఉషశ్రీచరణ్ స్థానాన్ని మారుస్తున్నట్టు సమాచారం. అదేవిధంగా రాయదుర్గం, గుంతకల్లు స్థానాల్లోనూ మార్పులు జరగవచ్చునని ప్రచారం నడుస్తోంది. ఇక సత్యసాయి జిల్లా హిందూపురంలో ఇప్పటికే మార్పు జరిగింది. ఇక మడకశిర నియోజకవర్గంలో తిప్పేస్వామి మార్పు ఉండనుంది. ఈమేరకు ఆయనకు ఇటువంటి సంకేతాలను ఇచ్చారు. కదిరిలో గత కొంతకాలంగా కొత్తవారి పేర్లు తెరపైకి వచ్చిన విషయం తెలిసిందే. మక్బుల్‌ను నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమించే అవకాశాలున్నాయని ప్రచారం నడుస్తోంది. పుట్టపర్తిలో శ్రీధర్‌రెడ్డి కాకుండా ఆయన భార్యకు అవకాశం కల్పించే సూచనలున్నట్టు సమాచారం. ఇక రాప్తాడులోనూ బిసిలకు అవకాశం కల్పిస్తే ఎలాగుంటుందన్న ఆలోచన అధిష్టానం మదిలోనున్నట్టు ఆ పార్టీవర్గాల్లో చర్చ నడుస్తోంది.

పార్లమెంటుకు కొత్తవారేనా ?

అనంతపురం, హిందూపురం పార్లమెంటు స్థానాలకు ఎంపిలిద్దరినీ మార్చే సూచనలు కనిపిస్తున్నాయి. అనంతపురానికి తలారి రంగయ్య ఉండగా, హిందూపురానికి గోరంట్ల మాధవ్‌కు ఈసారి అవకాశం లేనట్టు తెలుస్తోంది. ఈ రెండు చోట్ల కొత్త వారికి అవకాశం కల్పించే అవకాశాలున్నాయి. మార్పులు, చేర్పుల్లో కొత్త వారికి ఎవరికి అవకాశాలొస్తాయన్నది ఆసక్తికరంగా మారింది. అనేక మంది కొత్తవారు కూడా టిక్కెట్టు రేసులో నిలుచున్నారు.

యువతను మోసం చేసిన జగన్

టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి

ప్రజాశక్తి -పెనుకొండ

జాబ్ క్యాలెండర్ పేరిట యువత, నిరుద్యోగులను సిఎం జగన్ మోసం చేశారని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారధి మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేసి లక్షల సంఖ్యలో ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి మాట తపాడన్నారు. వైసిపి పాలనలో ఎన్నో పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలిపోయాయన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం 2020 నాటికి 66,309 ఖాళీలు ఉండగా 2021-22లో 10,143 ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేశారన్నారు. ఐదేళ్లు కావస్తున్నా ఒకే ఒక జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కిందన్నారు. నిరుద్యోగ యువతకు నెలకు రూ. 5వేల గౌరవ వేతనంతో గ్రామ వాలంటీర్ ఉద్యోగం ఇచ్చి వారిని ఉద్ధరించినట్లు డబ్బా కొట్టుకొంటున్నా రని ఎద్దేవా చేశారు. ఎన్నికలు సమీపిస్తున్నవేళ గ్రూప్-2, గ్రూప్-1 ఉద్యోగాలకు జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం విడ్డురంగా ఉందన్నారు. టిడిపి హయాంలో పెనుకొండలో నిర్మించిన కియా కార్ల పరిశ్రమ వల్ల 15వేల ఉద్యోగాలు కల్పించిన ఘనత చంద్రబాబు ది అన్నారు. కియా అనుబంధ సంస్థలు పెనుకొండ పరిసర ప్రాంతాలకు వచ్చి ఉంటే దాదాపు 25వేల నుంచి 30వేల ఉద్యోగాలు వచ్చేవన్నారు. యువతకు జాబు రావాలంటే బాబు రావాలని, వచ్చే ఎన్నికల్లో యువత టిడిపికి మద్దతు తెలపాలని కోరారు. చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా పరిపాలన సాగించారని గుర్తు చేశారు.

అంగన్వాడీలకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

గుడిబండలో జరిగిన సమ్మెలో మాట్లాడుతున్న ఇంతియాజ్

మడకశిరలో జరిగిన సమ్మెలో పాల్గొన్న అంగన్వాడీలు, నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

అంగన్వాడీలకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని పర్మినెంట్ ఉద్యోగులకు ఇచ్చే కనీస వేతనాలు, డిఎ, ఇతర అలవెన్సులు ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త సమ్మెలో భాగంగా మంగళవారం స్థానిక ప్రశాంతి గ్రామ్‌లో ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ప్రాజెక్టు అధ్యక్షురాలు సుజాత అధ్యక్షతన నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వానికి అంగన్వాడీల సమస్యలపై వినతులు ఇస్తున్నప్పటికీ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. మంత్రులు, ఇతర అధికారుల హామీలు నెరవేర్చలేదని అధికారులతో జరిగిన చర్చల్లో చిన్నాచితక సమస్యలు కొన్ని పరిష్కారం అయినా ప్రధాన సమస్యలు పరిష్కారం కాలేదని విమర్శించారు. రాష్ట్రంలో ఉన్న 55,605 అంగన్వాడీ సెంటర్లను డిసెంబర్ 12నుండి నిరవధికంగా మూసివేయాలని ప్రధాన మూడు యూనియన్లు నిర్ణయించాయని చెప్పారు. పాలకుల విధానాల వలన అంగన్వాడీలకు వేతనాలు పెరగలేదన్నారు. భారత కార్మిక మహాసభ సిఫార్సు మేరకు ప్రతి కార్మికునికీ కనీస వేతనం రూ.26 వేలతో పాటు సామాజిక భద్రత సౌకర్యాలైన పిఎఫ్, ఇఎస్ఐ, పెన్షన్ తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అంగన్వాడీలకు ఎటువంటి పరిమితులు విధించకుండా సంక్షేమ పథకాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ప్రాజెక్టు కార్యదర్శి నాగమణి, కోశాధికారి ఎస్ మంజుల, సిఐటియు నాయకులు బాళ్ల అంజి, సిద్దు, సెక్టార్ లీడర్లు షర్మిల, సుబ్బలక్ష్మి, భగవతి, జ్యోతి, అరుణ, అనిత, యశోద, పెద్ద ఎత్తున అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, మినీ అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నల్లచెరువు : మండల కేంద్రంలో అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్, యూనియన్, సిఐటియు మద్దతుతో సమ్మె కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు సుబ్బిరెడ్డి, మాట్లాడుతూ అంగన్వాడీలతో ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయించుకుంటోందని పనికి తగిన వేతనం ఇవ్వకుండా వారిని ఇతర పనులకు ఉపయోగించుకుంటూ ఇబ్బందులకు గురి చేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు రామకృష్ణ, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు శ్రీరాములు, వ్యవసాయ కార్మిక సంఘం రమేష్, అంగన్వాడీ యూనియన్ నాయకులు సరస్వతి, పద్మావతి, రమణమ్మ, లక్ష్మీదేవి, భారతి, తదితరులు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మహమ్మదాబాద్ క్రాస్ లో ఉండే ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట నిరువేదిక సమ్మెకు దిగారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, మండల కార్యదర్శిశ్రీరాములు, జిల్లా నాయకులు బాబావలి, మండల అధ్యక్షులు కుళ్లాయప్ప, యూనియన్ నాయకురాలు రంగమ్మ, మణిమాల, ఆశీర్వాదమ్మ, ఆదిలక్ష్మమ్మ, విమలమ్మ, వరలక్ష్మి ,కిష్టమ్మ , సరళ తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : మండలకేంద్రంలో ఉన్న ఐసిడియస్ ఆఫీసు ఎదుట అంగన్‌వాడీలు సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా సిఐటియు నాయకులు, శ్రామిక మహిళా కన్వీనర్ దిల్షాద్, సిఐటియు నాయకులు తాడిమర్రి నారాయణ మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారి న్యాయమైన సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈకార్యక్రమంలో మండల నాయకులు వాసంతి, రజియా, భారతి, వసంత, రజిత, పుష్పలత, శివమ్మ, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల నిరసనకు శ్రీరామ్ మద్దతు : మండల కేంద్రంలో అంగన్వాడీలు చేస్తున్న నిరసనకు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటా శ్రీరామ్ మద్దతు పలికారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

కదిరి అర్బన్ : అంగన్వాడీ వర్కర్స్ ,హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా సమ్మెలో భాగంగా మొదటి రోజు మంగళవారం పట్టణ ఐసిడిసి ఆఫీసు ఎదుట సమ్మె నిర్వహించారు. ప్రాజెక్టు కమిటీ అధ్యక్షులు సుశీల అధ్యక్షతన జరిగిన ఈ సమ్మెలో దాదాపు 500 మంది కార్మికులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మహాబున్నీసా, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జిఎల్. నరసింహులు, పట్టణ కార్యదర్శి జగన్మోహన్, నాయకులు బాబ్జాన్, ఫాజిల్, శివ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : అంగన్వాడీలకు సిఎం జగన్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్‌పి శ్రీనివాసులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. రూరల్ మండలం ఐసిడిఎస్ సిడిపిఒ కార్యాలయం ఎదుట సిఐటియు, ఎఐటియుసి, అంగన్వాడీ కార్యకర్తల యూనియన్ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు బైటాయించి నిరవధిక సమ్మె చేశారు. ఈ సమ్మెకు తెలుగు మహిళలు మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీని తక్షణమే అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చకపోతే కలెక్టరేట్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు పరిధిలో ఉన్న అంగన్వాడీ వర్కర్లు, ఆయాలతో పాటు అంగన్వాడి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటలక్ష్మి, తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి పరిమళ, కెవిపిఎస్ కార్యదర్శి రమణ, నాయకులు వెంకటేష్, గోపాల్, రామచంద్ర, అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు శోభారాణి, ప్రధాన కార్యదర్శి లావణ్య, కోశాధికారి శిరీషా, తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ : సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు విధులను బహిష్క రించి నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు. ఈ మేరకు స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ముఖ్య అతిథిగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఇంతియాజ్ హాజరై మాట్లాడారు. అంగన్వాడీ వర్కర్లు, మినీ వర్కర్లు, హెల్పర్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనాలు చెల్లించకపోవడం అన్యాయమ న్నారు. సెంటర్ల నిర్వహణ బిల్లులను సకాలంలో చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ ప్రతినిధులు శ్రీదేవి, మహాదేవమ్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు ఈరేష్, అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

పెనుకొండ : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీ వర్కర్స్ సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద సమ్మె చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బాబావలి, తిప్పన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు వెంకటరాముడు, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్ట్ నాయకురాలు జయమ్మ, సెక్టార్ లీడర్లు మాబున్నీసా, లక్ష్మీదేవి, శ్యామల, గౌరీ, వరలక్ష్మి, పార్వతమ్మ పాల్గొన్నారు.

మడకశిర : దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట ప్రాజెక్టు పరిధిలోని మడకశిర, రొళ్ల, అగళి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ నిరవధిక సమ్మె చేపట్టారు. వీరికి మాజీ ఎమ్మెల్యే కె.ఈరన్న మద్దతు పలికారు. ఈరన్న మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిఎం జగన్ నవరత్నాలు పేరుతో బటన్ నొక్కడం తప్ప అభివృద్ధి, సంక్షేమం శూన్యమని విమర్శించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి సాంబశివ, డివిజన్ కార్యదర్శి రామాంజనేయులు, అంగన్వాడీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు ఉషారాణి, సిపిఐ తాలూకా ఇన్‌ఛార్జి పవిత్ర, సిపిఎం నాయకులు రామాంజనేయులు, క్రిష్టప్ప, రమేష్, నరేష్, శివ, బాలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

పెనుకొండ : మండల పరిధిలోని కియా పోలీస్ స్టేషన్ ఎదురుగా జాతీయరహదారి-44పై మంగళవారం విజిలెన్స్ అధికారులు జయపాల్‌రెడ్డి, జె.వాసుప్రకాష్, స్థానిక మండల రెవెన్యూ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. అక్రమంగా రవాణా చేస్తున్న 119.50 క్వింటాళ్ల రేషన్ బియ్యం (రూ. 4.5 లక్షల విలువ) స్వాధీనం చేసుకుని ఓ వాహనాన్ని సీజ్ చేశారు. వాటిని సిఎస్‌డిటి జి.ప్రభావతికి అప్పజెప్పారు. నిందితులైన బియ్యం యజమాని ఎస్.ఖలీల్‌బీ, వాహన యజమాని అబ్దుల్ రెహ్మాన్‌బీ, డ్రైవర్ ఎస్.సద్దాంలపై క్రిమినల్ కేసు నమోదు చేశారు

హుండీ ఆదాయం రూ.2.46 లక్షలు

అమరాపురం : మండల పరిధిలోని ప్రసిద్ధిగాంచిన హేమావతి హెంజేరు సిద్దేశ్వరస్వామి ఆలయ హుండీలోని కానుకలను మంగళవారం ఆలయ కమిటీ ఛైర్మన్, పురావస్తు శాఖ అధికారి నాగేంద్ర ప్రసాద్, అర్చకుల ఆధ్వర్యంలో లెక్కించగా రూ.2.46 లక్షల ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో జెసిఎస్ కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి, వెంకటరమణయాదవ్, సిద్దేశ్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

గోరంట్ల : పట్టణానికి చెందిన పాత్రికేయుడు ఈశ్వర్‌పై ఇటీవల కొందరు దాడి చేయగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందారు. అనంతరం ఈశ్వర్ ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుండగా టిడిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే బికె.పార్థసారథి మంగళవారం ఈశ్వర్ ఇంటికెళ్లి పరామర్శించా రు. ఆయనతో పాటు టిడిపి మండల ప్రధాన కార్యదర్శి అశ్వర్థరెడ్డి, ఉమర్‌ఖాన్, జయరాం, గంగంపల్లి నరసింహులు, నరేష్‌యాదవ్, వెంకట్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

రాజ్యసభ సభ్యుడి నిధులతో సీసీ రోడ్డు

లేపాక్షి : టిడిపి రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవికుమార్ ఎంపి నిధులతో స్థానిక బిసి కాలనీలో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. కొన్నేళ్లుగా రహదారి సక్రమంగా లేకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యను స్థానిక టిడిపి నాయకులు ఎమ్మెల్యే బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవికుమార్‌తో చర్చించి రూ. 3 లక్షలు మంజూరు చేయించారు. ఆ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం స్థానిక టిడిపి నాయకులు పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జయప్ప, ఆనంద్‌కుమార్, మూర్తి, తదితరులు పాల్గొన్నారు

'ఆడుదాం ఆంధ్ర' కిట్లు పంపిణీ

లేపాక్షి : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులకు 'ఆడుదాం ఆంధ్ర' కిట్లు పంపిణీ చేశారు. అతిథులు మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో గ్రామ స్థాయి నుంచి క్రీడాకారుల ను ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. 12 పంచాయతీలకు క్రికెట్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, రింగ్స్, బాడ్మింటన్‌కు సంబంధించిన క్రీడా పరికరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ నారాయణస్వామి, జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచులు ఆదినారాయణ, అశ్వర్థనారాయణప్ప, మంజునాథ్, ఇఒఆర్‌డి శివన్న, పంచాయతీ కార్యదర్శులు ప్రకాష్, రమేష్, నాగేంద్ర, దుర్గయ్య, మల్లికార్జున, రామాంజనేయులు, ఆనంద్‌కుమార్, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు దుస్తులు పంపిణీ

ఓబుళదేవరచెరువు : వికలాంగుల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రం షాది మహల్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ వికలాంగులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు . దాదాపు 180 మందికి నూతన వస్త్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ జయచంద్ర, ఐటిడిపి మండల కన్వీనర్ కుమార్ రాయల్, మైనార్టీ నాయకులు నిజాం, దిగువపల్లి ప్రసాద్, షాను, మహిళా నాయకురాలు మస్తానమ్మ, నాగరాజు, అబ్బులు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

పుట్టపర్తి రూరల్: ప్రభాత్ రూరల్ డెవలప్ మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహజంచారు. అనహాటా స్టిల్టింగ్ వారి సహకారంతో పుట్టపర్తి మండలంలోని జగరాజుపల్లి, వెంకటగారి పల్లి గ్రామాలలో ఉచిత ఈ కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా మెడికల్ హెల్త్ ఆఫీసర్ ఎస్వీ కృష్ణారెడ్డి, సత్యసాయి విదేశీ భక్తురాలు మొనికా అన్నా ముల్లర్, డాక్టర్ శ్రీనివాసులు, మహమ్మద్ షరీఫ్, సర్పంచి లక్ష్మిదేవి ఓబులేసు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కంటి వ్యాధి తీవ్రతను బట్టి కొందరిని ఆపరేషన్‌కు రెఫర్ చేయగా మరికొందరికి కళ్లజోడు, కంటి చుక్కలు మందులు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌డిఎస్ సెక్రెటరీ ప్రభాకర్ రెడ్డి, అప్తాల్మాలజీ డాక్టర్ బషీర్ అహమ్మద్, డాక్టర్ అనీల్, లాబ్ టెక్నీషన్ మురళి, పిఆర్‌డిఎస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సింగిల్‌విండో అధ్యక్షుడి రాజీనామా

పరిగి : వైసిపి మండల సీనియర్ నాయకుడు, సింగిల్ విండో అధ్యక్షుడు మారుతి రెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. గత కొన్ని నెలల నుండి ఎమ్మెల్యే, స్థానిక నాయకుల వ్యవహారంపై అసంతృప్తిగా ఉన్న మారుతి రెడ్డి తన పదవికి రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. పార్టీ అధికారంలోకి వచ్చేందుకు అనేక వ్యవప్రయాసలకు ఓర్చిన తనకు పార్టీలో ప్రాధాన్యత కల్పించలేదని ఆయన అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు ఆయన సోమవారం రోజునే డిసిఒకు తన రాజీనామా పత్రాన్ని ఇచ్చారు. ఈ నేపథ్యంలో వైసిపి నాయకులు దిద్దుబాటు చర్యలకు సిద్ధమైనట్లు తెలిసింది. అయితే ఓ ప్రధాన పార్టీలో చేరేందుకు ఇప్పటికే ఆయన సుముఖంగా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.

నేడు కదిరిలో 'డయల్ యువర్ డిఎం'

కదిరి టౌన్ : కదిరి డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడానికి డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ మైనుద్దీన్ తెలిపారు. బుధవారం సాయంత్రం 4 గంటల నుండి 5 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బస్టాండులోని సమస్యలు, బస్సుల కంషిషన్లు, రూట్ల వివరాలు, ప్రయాణికులకు అదనపు సౌకర్యా లు, కొత్త బస్సు సర్వీసుల వివరాల గురించి తెలియజేయవచ్చునని అన్నారు. ప్రయాణికులు తమ సమస్యలను 08494-224315 నెంబరుకు తెలియజేయాలని కోరారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పుట్టపర్తి క్రైమ్ : ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పుట్టపర్తి డిపో ముందు నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం గేట్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై యాజమాన్యం అవలంభిస్తున్న మొండి వైఖరిని వీడనాడాలన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఉపాధ్యక్షులు శంకర్, సహాయక కార్యదర్శి శ్రీరామ్ నాయక్, జిల్లా కార్యదర్శి షబ్బీర్, ఉపాధ్యక్షులు శివశంకర్, గంగులయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లే అవుట్లను అరికట్టండి

ముదిగుబ్బ : మండల పరిధిలోని గుంజేపల్లి, దొరిగల్లు పొలాల్లో వెలిసిన అక్రమ లే అవుట్లను అరికట్టాలని సిపిఎం, సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మంగళవారం స్థానిక డిప్యూటీ తహశీల్దార్‌ను కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అమాయక పేద ప్రజల నుండి వారి భూములను లాక్కొని లేఅవుట్లు వేసి ఏమీ తెలియని అమాయక ప్రజలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని విమర్శించారు. వీటిని కాపాడాల్సిన బాధ్యత మండల స్థాయి అధికారులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండలవెంకటేష్, పోతలయ్య లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బీసీలకు సముచిత స్థానం కల్పించాలి

ముదిగుబ్బ : సామాజికంగా రాజకీయంగా ఆర్థికంగా వెన్నుపోటుకు గురి అవుతున్న బీసీ వర్గాలు రాజకీయంగా తగిన పాధాన్యత పొందడానికి ఐక్యంగా నిలవాలని ధర్మవరం నియోజకవర్గం సామాజికవేత్త గడ్డం రాజగోపాల్ అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం మండల పరిధిలోని మలక వేమల క్రాస్ లోని తన స్వగృహంలో సత్యసాయి జిల్లా బీసీ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ సమాజంలో అధిక శాతం జనాభా ఉన్న బీసీలకు రాజకీయ రంగంలో సముచిత స్థానం లభించడం లేదన్నారు. అగ్రవర్ణాలకు ఓటు బ్యాంకుగా మాత్రమే మిగిలిపోతున్నారన్నారు. అన్ని రంగాలలో వెనుకబడిన బీసీలు రాజకీయ అధికారంలో తమ వంతు ప్రాధాన్యత పొందడానికి అందరూ కలిసి కృషి చేయాలన్నారు, బీసీల్లో ఐక్యత లేకపోవడం, మార్గదర్శిగా నిలిచే సరియైన నాయకత్వం లేకపోవడం వల్ల తగిన స్థాయిలో ప్రాధాన్యత పొందలేని పరిస్థితి నెలకొందన్నారు. జనాభా నిష్పత్తి మేరకు రాజకీయాలలో తగిన ప్రాధాన్యత కల్పించేలా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లాస్థాయి బీసీ నాయకులు సామకోటి ఆదినారాయణ, కొట్టాల శ్రీరాములు, పలురు నాయకులు, పాల్గొన్నారు.

కంది పంటకోత ప్రయోగాలు

రొద్దం : మండల పరిధిలోని లోచర్ల ఆర్‌బికె పరిధిలో రైతులు సాగు చేసిన కంది పొలాల్లో మంగళవారం వ్యవసాయ అధికారులు పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. పెనుకొండ సహాయ వ్యవసాయ సంచాలకులు కె.స్వయంప్రభ, ప్రత్యేక పర్యవేక్షణ అధికారిగా హాజరయ్యారు.

In the court of the Prl District Judge:Ananthapuramu
O.P.No:23/2023
Between:
Khassenova Nailya ...Petitioner
And
Manzoor Ahmad Dar ...Respondant
Notice to Respondant
To:
Manzoor Ahmad Dar S/o Ghulam Mohiuddin Dar, R/o D.No:41/79K, Satchitananda Apartments, Chitravathi Road, Yenumula palli Village, Puttaparthy Mandal, Sri Sathya Sai Dist.
పై నెంబరు కేసులో రెస్పాండెంట్ అయిన మీ హాజరు నిమిత్తము 23-12-2023 వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
B.ABUBAKAR,
B.MOHAMMED SHANWAZ
ADVOCATES, PENUKONDA,
B.NALLA REDDY,
ADVOCATE, ANANTHAPURAMU.

In the court of the prl.District Judge:Ananthapuramu
Cr.R.P.No:65/2023
Between:
Kavali Anjineyulu @ Kavli Anjineyulu ...Petitioner
And
State by S.H.O,of Dharmavaram Urban P.S Rep by Public Prosecuter, Ananthapuramu and others ...Respondants
Notice to Respondant No:2,3 and 5
R2: Boya Akkulappa @ Kondapalli Akkulappa S/o Narigappa H.No:9/149, Residing of Sri Haripuram (V) Kuntimaddi Post Ramagiri Mandal.
R3: Niluri Nagaraju S/o Late M.Ramadasu R/of H.No:28-1043, Lakshmi Nagar, Dharmavaram Town,
R4: Thalari chinna Penna Obuleshu @ Obileshu S/o Late Nagappa, R/at H.No:32-450, Tarakaramapuramu, Dharmavaram Town,
R5: Anjineyulu @ Yeturi Anjineyulu S/o Y.Narayanappa, R/at H.No:1-185, Gudisetty Kottala, Dharmavaram Town,
పై నెంబరు కేసులో పిటీషనరు రెస్పాండెంట్స్ అయిన మీపై ధర్మవరం కోర్టు తీర్పుపై రివిజన్ ఫిటీషన్ మహీంద్రా స్కార్పియో బేరింగ్ నెం:AP.39-HD-5369 ను విడుదల చేయవలెనని అర్జీ దాఖలు చేసియున్నారు. వాయిదా 27/12/2023 వ తేదిన ఉదయం 10:30 గం॥లకు రెస్పాండెంట్స్ అయిన మీరు పై కోర్టు నందు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ హాజరు కావలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
దబ్బర నారాయణ స్వామి,
అడ్వకేట్, అనంతపురం సెల్:9848079318

మహారాజశ్రీ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో, కదిరి
O.S. NO:290/2022
Between:
దేరంగుల జగన్ మోహన్ S/o లేట్ వెంకటస్వామి APSRTC డ్రైవర్, కదిరి డిపో, కదిరి టౌన్, శ్రీ సత్యసాయి జిల్లా. ...వాది
మరియు
బూసే కళ్యాణ చక్రవర్తి S/o బి.శ్రీరాములు, APSRTC డ్రైవర్, ధర్మవరం డిపో, నివాసము వడ్డివారిపల్లి గ్రామం, అయ్యవారిండ్లు H/o కదిరి కుంట్లపల్లి, కదిరి మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. ...ప్రతివాది
ప్రతివాదికి సమను
ఇందుమూలముగా పై తెలిపిన కేసులో ప్రతివాది అయిన బూసే కళ్యాణ చక్రవర్తి అయిన మీకు తెలియజేయడము ఏమనగా పై కోర్టు వారు మీ హాజరు నిమిత్తము తేది:26/12/2023 న వాయిదా వేసి వున్నారు. కావున సదరు తేది:26/12/2023 న ఉదయం 10:30 గంటలకు మీరు స్వయముగా గాని, వకీలు ద్వారా గాని పై తెలిపిన కోర్టులో హాజరు అయి మీకు ఎటువంటి ఆక్షేపణలు, అభ్యంతరములు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేని యెడల పై దావా మీ పరోక్షమున తీర్మాణించెదరు.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది:26/12/2023
స్థలం: కదిరి
టి.బాబాజాన్, ఎమ్.ఎ., ఎల్.ఎల్.బి.,
వాదిపరం న్యాయవాది కదిరి

కెజిబివిలో కాలం చెల్లిన పాల ప్యాకెట్లు

సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అధికారి (ఇన్‌సెట్‌లో కాలం చెల్లిన పాలప్యాకెట్)

ప్రజాశక్తి - చిలమత్తూరు

స్థానిక కెజిబివిలో కాలంచెల్లిన పాలప్యాకెట్లను వినియోగిస్తున్నారు. సోమవారం కెజిబివి విద్యార్థిని ఆత్మహత్యాయత్నం నేపథ్యంలో మంగళవారం స్థానిక ఎంపిడిఒ నరేష్ క్రిష్ణ, ఎంఇఒ సల్మాన్ రాజ్, డిసిడిఒ మాధవి తదితరులు స్థానిక కెజిబివిని తనిఖీ చేశారు. వంట గదిని పరిశీలించిన అధికారులు అక్కడ కాలం చెల్లిన పాలప్యాకెట్లు ఉండటాన్ని గమనించారు. 11 వ తేదీనాటికే కాలం ముగిసిన పాలప్యాకెట్లను వాడుతుండటాన్ని గమనించిన అధికారులు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి నిర్లక్ష్యపు పనులు చేయడం వల్ల బాలికల ఆరోగ్యం దెబ్బతినకుండా ఉంటుందా అని మండిపడ్డారు. విద్యార్థులను మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించడం లేదని తేల్చారు. అలాగే మరుగుదొడ్ల నిర్వహణ, భవన నిర్వహణ అపరిశుభ్రంగా ఉందని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలా అయితే విద్యార్థులలో పోష్టికాహారలోపంతో పాటు అనారోగ్య సమస్యలు

బాలికల ప్రాణాలతో చెలగాటం

తలెత్తుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ ముందు గాయిత్రి పాలు అందజేసే వారని అయితే ఇప్పుడు "అమ్మ" పాల ప్యాకెట్లు అందజేస్తున్నారని అధికారులు తెలిపారు.కాంట్రాక్టర్ వేలం పాట సమయంలో ఏ బ్రాండ్ పాలప్యాకెట్లు అందజేస్తానని తెలిపారో అవే సరఫరా చేయల్సి ఉందన్నారు. పాఠశాలకు చెందిన విద్యార్థిని ఆత్మహత్యాయత్నం విషయంపై అధికారులు ఉపాధ్యాయులను, విద్యార్థినులను విచారించారు. విద్యార్థిని సున్నిత మనస్కురాలు కావటంతో మనోవేదనకు గురైందని తమ విచారణలో తేలిందని చెప్పారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని అన్నారు.

తపాలా సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

ఆందోళన చేస్తున్న తపాలా ఉద్యోగులు

ప్రజాశక్తి-హిందూపురం

తపాలా శాఖ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం తపాలా శాఖ కేంద్ర కమిటీ యూనియన్ పిలుపు మేరకు తపాలా సిబ్బంది పట్టణంలోని ప్రధాన తపాలా కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు కేంద్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతు రోజుకు (జిడిఎస్‌లకు) 8 గంటలను పని దినంగా పరిగణించాలన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సమానపనికి సమాన వేతనం చెల్లించాలని, సీనియారిటీ ఇంక్రిమెంట్ కల్పించాలని డిమాండ్ చేశారు. సిబ్బంది కుటుంబ సభ్యులకు వైద్య సదుపాయం సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకు ప్రతి తపాలా ఉద్యోగి సమ్మెలో పాల్గొని విజయం సాధించేవరకు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు అబ్దుల్ మునాఫ్, నరసింహులు, ప్రభాకర్, నాగరాజు, జనార్దన్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి క్రైమ్ : గ్రామీణ తపాల ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని సమ్మెబాట పట్టారు. ఈ మేరకు మంగళవారం స్థానిక గోకులంలోని తపాలా కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల తపాలా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ తపాలా ఉద్యోగులు అల్లా బకాష్, ప్రసాద్, మౌలాలి, భారతి, నాగరాజు జనరల్ సెక్రెటరీ, జనార్ధన, మునఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ యూనివర్శిటీ వాలీబాల్ పోటీలకు 'మంగళకర' విద్యార్థులు

ప్రతిభా విద్యార్థులతో కళాశాల నిర్వాహకులు

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్ పోటీలకు మంగళకర కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ సురేష్ కుమార్ తెలిపారు. కళాశాలలో బిబిఎ ప్రథమ సంవత్సరం చదువుతున్న కరుణాకర్, తృతీయ సంవత్సరం చదువుతున్న నజీర్ హుస్సేన్ ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. జాతీయ స్థాయిలో జరిగే వాలీబాల్ టోర్నమెంట్‌కు ఎంపికైన వీరు కర్నాటక రాష్ట్రంలోని బెల్గావి విశ్వేశ్వరయ్య యూనివర్సిటీ వాలీబాల్ టోర్నమెంటులో ఎస్.కె యూనివర్సిటీ జట్టు తరపున ఆడనున్నారన్నారు. ఈనెల 22వ తేదీ నుండి, 25 వరకు నిర్వహించే టోర్నమెంట్లో వీరు పాల్గొననున్నారని చెప్పారు. ఎంపికైన విద్యార్థులను మంగళకర డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ సురేష్ కుమార్, ఎఒ జయచంద్ర రెడ్డి, మంగళకర డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రమేష్ బాబు, పీడీ శ్రీనివాసులు, అధ్యాపకులు అభినందించారు.

వికలాంగులను చిన్నచూపు చూడొద్దు

గాండ్లపెంట : అంతర్జాతీయ విభిన్న ప్రతిభా వంతుల దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం మండల కేంద్రంలో జీవనజ్యోతి మండల సమైక్య ఆధ్వర్యంలో వికలాంగులతో ర్యాలీ నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిటి ఎస్‌టిఎల్ కేశవమూర్తి, జీవనజ్యోతి మండల సమైక్య అధ్యక్షుడు కొండారెడ్డి, మస్తాన్, ఇంతియాజ్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై 'సజ్జల'కు వినతి

సజ్జల రామకృష్ణారెడ్డికి సమస్యలు వివరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని వైయస్సార్ టీచర్స్ అసోసియేషన్ తోపాటు పిఆర్‌టియు రాష్ట్ర, జిల్లా నాయకులు ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డికి విన్నవించారు. ఈ మేరకు నాయకులు అశోక్ కుమార్ రెడ్డి, పివి రమణారెడ్డి, రజినీకాంత్ రెడ్డి, సుందర్ లతో పాటు ఎమ్మెల్సీలు ఎం వి రామచంద్ర రెడ్డి, కల్పలత రెడ్డి, అప్పి రెడ్డి మంగళవారం విజయవాడలో సజ్జలను కలిసి సమస్యను వివరించారు. పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని, పిఎఫ్ లోన్లు, మెడికల్ బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు. వేతనాలు ప్రతినెల 1వ తేదీన చెల్లించాలన్నారు.

ఒపిఎస్ అమలు చేయాలి : ఎస్‌టియు

ప్రజాశక్తి-మడకశిర

పాత పెన్షన్ విధానం(ఒపిఎస్)ను అమలు చేయాలని ఎస్‌టియు జిల్లా నాయకులు టి.ఆదినారా యణ డిమాండ్ చేశారు. పట్టణంలో మంగళవారం చేపట్టిన ఎస్‌టియు నమోదు కార్యక్రమంలో ఆదినారాయణతో పాటు ఉపాధ్యాయులు తిప్పేస్వామి, శామ్యూల్, విష్ణు, బాబు, మాలతి, రంగలక్ష్మి, సంగీత, రాధిక పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలుపరచాలని డిమాండ్ చేశారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి-హిందూపురం

ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్‌పి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆశాల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 14,15 తేదీల్లో ఆశాల ధర్నా, 36 గంటల వంటావార్పు కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరుతు నియోజక వర్గ వ్యాప్తంగా ఉన్నా అన్ని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల వైద్యాధికారులకు వినతిపత్రాలు సమర్పిస్తున్నామని చెప్పారు. హిందూపురం రూరల్ మండలం చౌళూరు పిహెచ్‌సిలో జరిగిన కార్యక్రమంలో జెడ్‌పి శ్రీనివాసులు, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు మాట్లాడుతు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమస్యల పరిష్కారం కోసం ఈనెల 14, 15 తేదీలలో జిల్లావైద్యాధికారి కార్యాలయం ఎదుట 36 గంటల వంటా, వార్పు, ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆశాలకు కనీస వేతనాలు చెల్లించాలని, పనిభారాన్ని తగ్గించాలని, ప్రభుత్వ సెలవులు, రిటైర్మెంట్, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రాజప్ప, ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు రాధ, భూమిక, పద్మ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న ఆశాలు, నాయకులు

48 కుటుంబాలకు వైఎస్ఆర్ ప్రమాద బీమా డిఆర్‌డిఎ పీడీ నరసయ్య

పుట్టపర్తి అర్బన్ : జిల్లా వ్యాప్తంగా 2023లో ప్రమాదవశాత్తు మృతి చెందిన 48 మందికి చెందిన కుటుంబాలు వైఎస్ఆర్ ప్రమాద బీమా లబ్ధి చేకూరినట్లు డిఆర్‌డిఎ పీడీ నరసయ్య తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వివిధ రకాలుగా మృతి చెందిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 5లక్షలు నేరుగా ఆయా కుటుంబాల వారి ఖాతాలో ప్రభుత్వం జమ చేసిందన్నారు. గతంలో ప్రమాద బీమా ఎల్ఐసి ద్వారా చెల్లించే వారన్నారు. అయితే ఆ కంపెనీ సంవత్సరాలుగా క్లైములు పెండింగ్‌లో పెడుతుండడంతో ఆ కంపెనీ పై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం ప్రభుత్వమే నేరుగా బీమా పరిహారం బాధితుల కుటుంబాలకు జమ చేస్తోందన్నారు. క్లైములు తగిన రీతిలో పంపిన 15 రోజులకే బీమా పంపిణీ చేయడం జరుగుతోందన్నారు.

నేడు కేంద్ర కరువు బృందం పర్యటన

మడకశిర : మండలంలో బుధవారం కేంద్ర కరువు అధ్యయన బృందం పర్యటిస్తున్నట్లు ఎఒ తిమ్మప్ప ఓ ప్రకటనలో తెలిపారు. ఆ బృందం బుల్లసముద్రం, హరేసముద్రం గ్రామాల్లో పర్యటించి కంది పంటను పరిశీలిస్తారన్నారు. అనంతరం కదిరేపల్లి రైతు భరోసా కేంద్రంలో జిల్లా స్థాయి ఫొటో ఎగ్జిబిషన్ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

పంటకోత ప్రయోగాలు

ముదిగుబ్బ : మండల పరిధిలోని ఎస్ బ్రాహ్మణ పల్లెలో పెసల పంట కోత ప్రయోగాలను మంగళవారం నిర్వహించారు. వ్యవసాయ శాఖ అధికారి లక్ష్మీనరసింహ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన పప్పురమ్మ, నారాయణమ్మ అనే మహిళా రైతులకు చెందిన పొలాల్లో పంటకోత ప్రయోగాలు నిర్వహించారు.

మండల వైద్యాధికారి బాధ్యతల స్వీకరణ

సోమందేపల్లి : సోమందేపల్లిలో సుపరిచిత వ్యక్తి అయిన మెడికల్ షాపు శీనప్ప కుమారుడు ఓంకార్ మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో మండల వైద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. దీంతో గుడిపల్లి గ్రామస్తులు, శ్రీ సజ్జగంట రంగనాథస్వామి బలిజ సంఘ ఆధ్వర్యంలో ఓంకార్‌ను పూలమాలలు, దుశ్శాలువాలతో సన్మానించారు. సోమందేపల్లిలో పుట్టి పెరిగి విద్యాభ్యాసం సాగించి ఇక్కడే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా బాధ్యతలు చేపట్టడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. వైద్యాధికారి ఓంకార్ మాట్లాడుతూ మండల ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ నాణ్యమైన వైద్య సేవలు అందిస్తానని తెలిపారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మడకశిర : రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మంగళవారం స్థానిక డిపో ఎదుట ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. యూనియన్ నాయకులు రామకృష్ణ మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన సేవలు, ఆర్టీసీ కార్మికులకు అరియర్స్, ఇపిఎఫ్, పరిమితి లేని వైద్యసేవలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యుటీ, అలవెన్సులు, ప్రమోషన్ ద్వారా గ్యారేజీలో ఖాళీల భర్తీ, పెండింగ్ ఇన్సెంటివ్‌లు, తదితర సమస్యలను పరిష్కరించాలని, ప్రధానంగా వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిపో సెక్రటరీ రామకృష్ణ, ట్రెజరర్ శంకర్ నాయక్, జయసింహ, పురుషోత్తం, ఎన్ఎంయుఎ డిపో కమిటీ, సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధిని ప్రజలకు వివరిద్దాం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కదిరి టౌన్

వైసిపి ప్రభుత్వం చేసిన, చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు వివరిద్దామని స్థానిక ఎమ్మెల్యే సిద్దారెడ్డి సూచించారు. కదిరి పట్టణం కంచుకోట వీధిలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ కి జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమంలో ఎమ్మెల్యే సిద్దారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శ్రేణులకు సూచించారు. జగనన్న చేపట్టిన కార్యక్రమాల వివరాలను ఇంటింటికి వెళ్లి చెప్పడం, వాటితో వారికి ఏమి లబ్ధి చేకూరిందో వివరించడం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఛైర్ పర్సన్, మున్సిపల్ కమిషనర్‌తో పాటు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కదిరి : కంచుకోట వీధిలో కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

ముదిగుబ్బ : గతంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలంటే లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే వారని, ప్రస్తుతం ఎటువంటి సిఫారసులు లేకుండా అర్హత ప్రామాణికంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారునికి అందుతున్నాయని వైసిపి మండల కన్వీనర్ సివి నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మర్తాడు గ్రామంలో వైఎపి నీడ్స్ జగన్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయాల కార్యదర్శి భాస్కర్, మండల ఉపాధ్యక్షులు కృష్ణమ్మ వెంకటేశ్వర రెడ్డి, రైతు సంఘం అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, ఎంపిటిసి వెంగళ రెడ్డి, మండల కో ఆప్షన్ మెంబర్ చిన్న బాలమునితో పాటు వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

హిందూపురం : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అన్నారు. మంగళవారం పురపాలక సంఘ పరిధిలోని15, 16వ వార్డుల్లో వార్డు కౌన్సిలర్ షాజియ అధ్యక్షతన రహమత్‌పురంలో ఏపీకి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు పరిధిలో వైసిపి జెండాను ఎగురవేసి, వార్డులో అభివృద్ధికి, సంక్షేమ పథకాలకు అందించిన నిధుల వివరాలతో కూడిన బోర్డులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ బలరామిరెడ్డి, జెసిఎస్ కన్వీనర్ శివశంకర్ రెడ్డి, కౌన్సిలర్ షాజియా, ఎ బ్లాక్ కన్వీనర్ సిపిసి సాదిక్, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, రాష్ట్ర బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, కాణిపాకం టెంపుల్ డైరెక్టర్ రవీంద్రుడు, కౌన్సిలర్లు, నాయకులు మున్సిపల్ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వార్డు వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం : మండల పరిధిలోని తమడేపల్లి గ్రామ సచివాలయం వద్ద సర్పంచి సదానంద గౌడ్ ఆధ్వర్యంలో 'వై ఎపి నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సంక్షేమ పథకాల బోర్డ్‌ను, ఆ తర్వాత వైసిపి జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇఒఆర్‌డి నాగముని, పంచాయతీ కార్యదర్శి మనోహర్‌శర్మ, జడ్పిటిసి సారక్క, నరసింహమూర్తి, ఎంపిపి ఈరన్న, వైస్ ఎంపిపి కృష్ణమూర్తి, జెసిఎస్ ఇన్‌ఛార్జి శ్రీనివాస్‌రెడ్డి, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

అరాచక పాలనకు ముగింపు పలుకుదాం

ప్రజాశక్తి-బత్తలపల్లి

ధర్మవరం నియోజకవర్గంలో సాగుతున్న అరాచక పాలనకు ముగింపు పలుకుదామని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. బత్తలపల్లి మండల కేంద్రంలోని మారుతినగర్ పరిసర ప్రాంతాల్లో మంగళవారం జరిగిన బాబు ష్యూరిటీ-భవిష్యత్ కు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరిగి మినీ మ్యానిఫెస్టోకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా స్థానికులు శ్రీరామ్ దృష్టికి పలు సమస్యలు తీసుకొచ్చారు. రోడ్లు సరిగా లేవని, డ్రయినేజీ వ్యవస్థ సరిగా లేక నీరు రోడ్డు పైకి వస్తోందని వాపోయారు. అనంతరం శ్రీరామ్ మాట్లాడుతూ ప్రజలు పడుతున్న కష్టాలు పరిష్కరించాల్సిన నేతలు భూములు కాజేయడంపై దృష్టిపెట్టారని ఆరోపించారు. గుడ్ మార్నింగ్ కార్యక్రమం అంటూ ప్రతి రోజు తిరిగే ఎమ్మెల్యేకు ఇలాంటి సమస్యలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. అధికార పార్టీ నాయకుల భూదాహానికి హద్దే లేకుండా పోయిందన్నారు. రైతులకు, పేదలకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోమన్నారు ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, జక్కంపూటి నాగభూషణం, బోయపాటి అప్పస్వామి , సతీష్ నాయుడు, చల్లా శ్రీనివాసులు, రంగా నాయుడు, సంఘాల సూరి, పూలమండి రాము, అయ్యప్ప, రాఘవంపల్లి శ్రీనివాసులు పాల్గొన్నారు.

బుక్కపట్నం : ప్రజలతో మాట్లాడుతున్న పల్లె రఘునాథ్‌రెడ్డి

బుక్కపట్నం : రాబోయే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపడమే లక్ష్యంగా టిడిపి జనసేన కలిసి పనిచేయాలని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, జనసేన నియోజకవర్గం సమన్వయకర్త పత్తి చంద్రశేఖర్ కోరారు. మంగళవారం సాయంత్రం మండల కేంద్రంలో భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు వీధులలో తిరుగుతూ టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తేచేపట్టబోయే సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ మలిరెడ్డి, మాజీ సర్పంచి యశోద రాయుడు, తెలుగు మహిళా అధ్యక్షురాలు లావణ్య గౌడ్, టౌన్ కన్వీనర్ వెంకటరాముడు, మాజీ ఎంపీపీ బాలు , నాయకులు గంగాధర్,కేశవ నాయుడు మంజునాథ్ జనసేన నాయకులు పాల్గొన్నారు.

మడకశిర : రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా మంగళవారం తిప్పేస్వామి ఆధ్వర్యంలో పట్టణ నాయకులు స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. టిడిపి అధికారంలోకి వస్తే చేపట్టే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మనోహర్, ప్రధాన కార్యదర్శి పుల్లయ్యచౌదరి, ఎస్.నాగరాజు, కృష్ణమూర్తి, బాబన్న, శివకుమార్, గంగాధర్, రమేష్, నల్లమల్లప్ప, శంకర్, రాజు, సంతోష్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ సబ్ సెంటర్ తనిఖీ

రొద్దం : మండల పరిధిలోని పెనుగొండ-మడకశిర ప్రధాన రహదారిలో ఉన్న పెద్దమంతూరు ఆరోగ్య సబ్ సెంటర్‌ను మంగళవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఎస్వీ కృష్ణారెడ్డి సందర్శించారు. నూతనంగా మంజూరైన హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లో ఓపి సేవలను ప్రారంభించాలని ఆదేశించా రు. పెనుకొండ డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ మంజువాణితో కలిసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం రొద్దం పిహెచ్‌సిని సందర్శించి ఆశా వర్కర్ల సమావేశానికి హాజరై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిడిఒ డాక్టర్ సిఎస్.సోమశేఖర్, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డిపిఎంఒ నాగరాజు, అసిస్టెంట్ బాబాఫక్రుద్దీన్, పెద్దమంతూరు సచివాలయ పంచాయ తీ సెక్రటరీ కె.బాబు, వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ కృష్ణారెడ్డి

పోలీస్ స్టేషన్ సందర్శన

రొద్దం : వార్షికోత్సవ తనిఖీల్లో భాగంగా మంగళవారం ఎస్పీ మాధవరెడ్డి స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల సమీపిస్తున్నందున ఫ్యాక్షన్ గ్రామాలు, ఫ్యాక్షన్ వ్యక్తులపై నిఘా, తదితర అంశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అలాగే పోలీస్ స్టేషన్ స్థలం, ఆలయ స్థలాన్ని పరిశీలించి ఎంపిపి చంద్రశేఖర్, వైసిపి నాయకులు రవిశేఖర్ రెడ్డి, ఎం.నారాయణరెడ్డి, మారుతిరెడ్డి, గిరిస్వామి తదితరులతో చర్చించారు. ఆయన వెంట పెనుకొండ డీఎస్పీ హుస్సేన్‌పీరా, సిఐ రాజారమేష్, ఎస్ఐ వలిబాషా ఉన్నారు.

పోలీస్ స్టేషన్, ఆలయ స్థలాలను పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వాదాయానికి గండి

తనకల్లు : 20ఏళ్లుగా కొనసాగుతున్న మండల పరిధిలోని సిజి ప్రాజెక్ట్ మత్స్యకారుల సొసైటీని 2021 నుంచి అధికారులు పట్టించుకోవడం లేదని మత్స్యకారుల సొసైటీ ప్రెసిడెంట్ బావాజీ విమర్శించారు. ఆయన మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నోఏళ్లుగా ఏ సమస్య లేకుండా సీజీ ప్రాజెక్టు మత్స్యకారుల సొసైటీని సాగించుకుంటూ వచ్చేవారమన్నారు. 2021 నుండి ఇప్పటి వరకు రూ. 48 వేల ప్రకారం రెండు దఫాలుగా మొత్తం రూ. 96 వేలు అప్పు చేసి సొసైటీ ఇన్స్పెక్టర్ శంకరయ్యకు చెల్లించామని, కానీ ఇంతవరకుచేపలు పట్టుకోడానికి అనుమతి ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఉన్నత అధికారులకు తెలిపినా ఫలితం లేకుండా పోయిందని విమర్శించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, తిప్పన్ననాయక్, గోపాల్ నాయక్, రంగ నాయక్, వైస్ ప్రెసిడెంట్, వెంకటరమణ, మెంబర్ నరసింహులు, పెద్దరెడ్డప్ప నాయక్ పాల్గొన్నారు.

నేడు జిల్లాలో కరువు బృందం పర్యటన

పుట్టపర్తి అర్బన్ : కేంద్ర కరువు పరిశీలన బృందం బుధవారం జిల్లాలో పర్యటించనున్నట్లు మంగళవారం కలెక్టరేట్ నుంచి ఓ ప్రకటన విడుదలైంది. ఉదయం 10:30 గంటలకు పరిగి మండలం మొద గ్రామానికి చేరుకుని 11:30 గంటల వరకు కరువు పరిస్థితిపై పరిశీలించి కంది పంటలను పరిశీలిస్తుంది. అక్కడి నుంచి మడకశిర మండలం బుల్లసముద్రం గ్రామానికి చేరుకుని అక్కడ కంది పంటలను పరిశీలించి 12:45 గంటలకు అక్కడ కరువు పై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను తిలకిస్తుంది. మూడు గంటలకు గుడిబండ మండలం జంబులబండ గ్రామంలో పర్యటిస్తుంది. నాలుగు గంటలకు అమలాపురం మండలం వలస గ్రామంలో పర్యటిస్తుంది. ఆరు గంటలకు తిరిగి ఆ బృందం అనంతపురం వెళుతుంది.

జాతీయ సమైక్యతా ర్యాలీ

పెనుకొండ : మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన పెనుకొండ బాబయ్య స్వామి దర్గా 751వ ఉరుసు మహోత్సవం సందర్భంగా దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద నుంచి విద్యార్థులు 500 అడుగుల జాతీయ పతాకంతో జాతీయ సమైక్యతా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో డీఎస్పీ హుస్సేన్‌పీరా, రవిశంకర్ గురూజీ, శ్రీనివాసులు, జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు జాబిలి చాంద్‌బాషా, బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు, హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.